క్లుప్తంగా

పౌష్టికాహారంపై అవగాహన



అంబేడ్కర్ నగర్ అంగన్‌వాడీలో అవగాహన కల్పిస్తున్న ఆరోగ్య సిబ్బంది, కార్యకర్తలు

విశాఖ విద్య: ఎన్‌ఏడీ సెంటర్‌లోని అంబేడ్కర్ నగర్, గౌరీ నగర్, బుచ్చిరాజుపాలెం అంగన్‌వాడీ కేంద్రాల్లో శుక్రవారం పౌష్టికాహార దినోత్సవాన్ని నిర్వహించారు. వైద్య ఆరోగ్య సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు సంయుక్తంగా గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో అందిస్తున్న పౌష్టికాహారాన్ని క్రమం తప్పకుండా తీసుకోవాలని సూచించారు.

గౌరీపరమేశ్వరులకు ప్రత్యేక పూజలు



కీర్తనలు ఆలపిస్తున్న భక్తులు

విశాఖ విద్య: జీవీఎంసీ 90వ వార్డు గవర వీధిలోని రామాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన గౌరీపరమేశ్వరులకు శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్తీక మాసం, ఏకాదశి కావడంతో అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. సామూహికంగా అమ్మవారిని స్మరిస్తూ కీర్తనలు ఆలపించారు. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అమ్మవారి తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.

సింహాచలం రైల్వే స్టేషన్‌లో ఏర్పాట్ల పరిశీలన



రైల్వే స్టేషన్‌లో ఏర్పాట్లను పరిశీలిస్తున్న రైల్వే జీఎం మనోజ్ శర్మ

గోపాలపట్నం: సింహాచలం రైల్వే స్టేషన్‌ను శనివారం కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ సందర్శించనున్నారు. ఈ నేపథ్యంలో ఇక్కడి ఏర్పాట్లను ఈస్టుకోస్టు రైల్వే జనరల్ మేనేజర్ మనోజ్ శర్మ శుక్రవారం రాత్రి పరిశీలించారు. పలు సూచనలు చేశారు. శనివారం మంత్రి స్వయంగా పర్యటించి స్టేషన్ అభివృద్ధిపై సమీక్షిస్తారని తెలిపారు. ఆయన వెంట డీఆర్ఎం సౌరబ్ ప్రసాద్, రైల్వే అధికారులు పాల్గొన్నారు.

నేటి నుంచి సంకల్ప యాత్ర ప్రచారం

దాబాగార్డెన్స్: జీవీఎంసీ పరిధిలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర ప్రచార కార్యక్రమం ఈఈసీ ప్రచార రథం ద్వారా 40 రోజుల పాటు నిర్వహించనున్నామని, దీనిలో భాగంగా తొలి విడత ఈ నెల 9 నుంచి 14 రోజుల పాటు ప్రచారం ఉంటుందని జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ పథకాల కింద అర్హులైనప్పటికీ ఇప్పటి వరకు ప్రయోజనం పొందని వారికి సహాయం అందడం, పథకాలపై అవగాహన కల్పించడం, సమాచార వ్యాప్తి, ప్రభుత్వ పథకాల లబ్ధిదారులతో వ్యక్తిగత అనుభవాలు పంచుకోవడం సంకల్పయాత్ర ఉద్దేశమన్నారు. జీవీఎంసీ పరిధిలో 8 జోన్లలో 40 రోజుల పాటు ఈ కార్యక్రమం జరగనుందని కమిషనర్ తెలిపారు.

పవన్ కల్యాణ్‌కు వీడ్కోలు



విమానాశ్రయంలో పవన్‌కు వీడ్కోలు పలుకుతున్న జనసేన శ్రేణులు

గోపాలపట్నం: తమ పార్టీ ముఖ్య నేతలతో సమావేశానికి విశాఖ వచ్చిన జనసేన అధినేత పవన్ కల్యాణ్‌కు విశాఖ విమానాశ్రయంలో శుక్రవారం అభిమానులు, కార్యకర్తలు వీడ్కోలు పలికారు. మధ్యాహ్నం 12.15 గంటలకు ప్రత్యేక విమానంలో ఆయన హైదరాబాద్‌కు వెళ్లారు.

మెరుస్తున్న రహదారులు



ఇది కదా అభివృద్ధి

- 52వ వార్డులో జోరుగా రోడ్ల నిర్మాణం
- రూ.కోట్ల మంజూరుతో చురుగ్గా పనులు
- హర్షం వ్యక్తం చేస్తున్న స్థానికులు



చూడముచ్చటగా ఎన్‌ఏడీ సెంటర్

పశ్చిమ నియోజవర్గంలో రహదారులు మెరుస్తున్నాయి. గతంలో గుంతలమయంగా ఉన్న కాలనీల్లోని దారులన్నీ నేడు అద్దంలా సుందరంగా కనిపిస్తున్నాయి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కాలనీల్లో మౌలిక సౌకర్యాల కల్పనకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోంది. ఈ నేపథ్యంలోనే ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా విశాఖ మహా నగరపాలక సంస్థ నుంచి ప్రాధాన్యతాక్రమంలో వార్డుల అభివృద్ధికి నిధులు కేటాయింపు చేస్తున్నారు.



గ్రీన్‌బెల్ట్ పార్కు ముందు రహదారి

విశాఖ విద్య : డిప్యూటీ మేయర్ ప్రాతినిధ్యం వహిస్తోన్న 52వ వార్డు గతంలో ఎన్నడూ లేని రీతిలో అభివృద్ధి పుంతలు తొక్కుతోంది. వార్డు పరిధిలోని అన్ని కాలనీల్లో అంతర్గత రహదారులను అభివృద్ధి చేశారు. గెడ్డలకు రిటైనింగ్ వాల్స్ నిర్మించటంతో పాటు, డ్రైనేజీలను పటిష్టం చేశారు.

ప్రత్యేకత సంతరించుకున్న వుడా లేఅవుట్..
ఎన్‌ఏడీ సెంటర్‌కు సమీపాన ఉన్న 52వ వార్డులోని వుడా లే అవుట్ ప్రత్యేకత సంతరించుకుంది. సువిశాలమైన రహదారులు, పచ్చని గ్రీనరీతో ఆహ్లాదకరంగా ఉన్నందున వుడా లే అవుట్‌లో స్థిర నివాసం ఏర్పాటు చేసుకునేందుకు ఎంతో మంది ఆసక్తి చూపుతారు. కాలనీ ప్రత్యేకత దృష్ట్యా దీని అభివృద్ధికి జీవీఎంసీ నుంచి పెద్ద మొత్తంలో నిధులు కేటాయించారు. ఒక్క వుడా లే అవుట్ కాలనీలోనే ఏకంగా రూ. 2.92 కోట్లతో రహదారులు నిర్మించారు. వుడా లే అవుట్, శాంతినగర్ ఏరియాల్లో రోడ్లన్నీ ఎంతో విశాలంగా కనిపిస్తున్నాయి.



ఎన్‌ఏడీ నుంచి గోపాలపట్నం వెళ్లే బీఆర్‌టీఎస్ రహదారి



ఎన్‌ఏడీ కాలనీ రహదారి

రహదారుల విస్తరణపై దృష్టి..
ఎన్‌ఏడీ కూడలిలో ఉన్న 52వ వార్డు ప్రాధాన్యత దృష్ట్యా రహదారుల విస్తరణపై జీవీఎంసీ అధికారులు దృష్టి సారించారు. వార్డు కార్పొరేటర్ జియ్యాని శ్రీధర్ డిప్యూటీ మేయర్‌గా వ్యవహరిస్తుండటంతో అధికారులు, ఇతర ప్రజా ప్రతినిధులను సమన్వయం చేసుకుంటూ పెద్ద మొత్తంలో నిధులు మంజూరు చేయిస్తున్నారు. దశాబ్దాల తరబడి పెండింగ్‌లో ఉన్న పనులకు సైతం మోక్షం లభిస్తోంది. హైవే నుంచి పాస్‌పోర్టు కార్యాలయం పక్కగా ఉన్న 30 అడుగుల రహదారిని 60 అడుగుల మేర విస్తరించేలా ప్రణాళిక సిద్ధమైంది. దీనికి రూ. 3 కోట్లతో ప్రతిపాదనలు సైతం సిద్ధమయ్యాయి.

నిధుల మంజూరు.. రోడ్ల నిర్మాణం ఇలా..

- రూ.7.10 కోట్ల అంచనా పనులు పూర్తి
- పురోగతిలో రూ.1.48 కోట్ల అంచనా పనులు
- నిధులు మంజూరై ప్రారంభించాల్సినవి రూ.1.76 కోట్ల పనులు
- నిధులు మంజూరై అగ్రిమెంట్ దశలో ఉన్నవి రూ.2.10 కోట్ల పనులు
- నిధులు మంజూరై టెండరు దశలో ఉన్నవి రూ.1.23 కోట్ల పనులు



హైవే నుంచి పాస్‌పోర్టు కార్యాలయానికి వెళ్లే రోడ్డు

రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాతే ఈ ప్రాంతం అభివృద్ధి చెందింది. గతంలో ఎప్పుడూ ఇంత పెద్ద ఎత్తున రహదారుల నిర్మాణం జరగలేదు. రాజకీయాలకు అతీతంగా పనులు చేస్తుండటం గొప్ప విషయం.

– బీఎస్ కృష్ణ, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్

అడగటమే తరువాయి



మా కాలనీలో సమస్య ఉందని అడగటమే తరువాయి, వెంటనే స్పందించి పనులు చేస్తున్నారు. డిప్యూటీ మేయర్ చొరవ తీసుకోవటం వల్లనే ఇన్ని పనులు జరిగాయి. అధికారులు కూడా ఎంతో బాగా స్పందిస్తున్నారు. గతంలో అయితే రాజకీయ నాయకుల చుట్టూ కాళ్లరిగేలా తిరిగేవాళ్లం.

– ఎస్. పద్మ, అంబేడ్కర్ నగర్

మా కాలనీకి గుర్తింపు వచ్చింది



మర్రిపాలెం వుడా లే అవుట్‌కు మంచి గుర్తింపు వచ్చింది. గతంలో ఎప్పుడూ ఇంతలా అభివృద్ధి జరగలేదు. మా కాలనీలోని రహదారులన్నీ అద్దంలా మెరుస్తున్నాయి. పార్కులను కూడా అభివృద్ధి చేయటం వల్ల అందరికీ ఎంతో ఉపయోగకరంగా ఉంది.

– డి.లక్ష్మణరావు, వుడా లేఅవుట్ కాలనీ

రోడ్లన్నీ బాగుపడ్డాయి



రోడ్లన్నీ మెరుగయ్యాయి. గతంలో అయితే గుంతలతో ఉన్న రహదారులపై ఆటోలు తిప్పటం ఎంతో కష్టంగా ఉండేది. కానీ ఇప్పుడా బాధ లేదు. ఆటో ప్రయాణం హాయిగా సాగిపోతోంది. రహదారులు అభివృద్ధి చేయటంతో ఆటో నిర్వహణ ఖర్చుల భారం కూడా తగ్గింది.

– వాసు, ఆటో డ్రైవర్, ఎన్‌ఏడీ సెంటర్

సీఎం జగన్ పాలనలో విప్లవాత్మక మార్పులు

సింధియా: విద్య, వైద్యం, వ్యవసాయ రంగాల్లో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డినే రాష్ట్ర ప్రజలంతా మళ్లీ కోరుకుంటున్నారని జిల్లా ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు కలిదిండి బద్రీనాథ్ అన్నారు. 62వ వార్డు త్రినాథపురం సచివాలయం పరిధిలో శుక్రవారం ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే... కార్యక్రమాన్ని కార్పొరేటర్, జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యుడు బల్ల లక్ష్మణరావు నేతృత్వంలో నిర్వహించారు. ముఖ్య అతిథి బద్రీనాథ్ పార్టీ జెండాను ఎగురవేసి, సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాల డిజిటల్ డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హతే ప్రామాణికంగా ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను అందజేస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌కే దక్కుతుందన్నారు. ఆయననే మళ్లీ ముఖ్యమంత్రిని చేసే విధంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని కోరారు. అనంతరం పార్టీ నాయకులు, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు, గృహసారథులు ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్‌సీపీ పాలనలో చేపట్టిన సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను వివరించే బుక్‌లెట్లను ప్రజలకు అందజేశారు. కార్యక్రమంలో భీశెట్టి గణేష్, భోగవిల్లి నాగభూషణం, వలంటీర్లు, గృహసారథులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.



62వ వార్డులో సంక్షేమ పథకాల డిజిటల్ బోర్డును ఆవిష్కరిస్తున్న బద్రీనాథ్

సీఎం జగన్‌తోనే సంక్షేమం, అభివృద్ధి
గోపాలపట్నం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డితోనే ప్రజా సంక్షేమం, రాష్ట్రాభివృద్ధి సాధ్యమని వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ పరిశీలకుడు ఎస్‌ఏ రెహమాన్ అన్నారు. జీవీఎంసీ కో ఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు ఆధ్వర్యంలో శుక్రవారం 92వ వార్డు 478 సచివాలయం వద్ద ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే... కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే జగనే మళ్లీ ముఖ్యమంత్రి కావాలన్నారు. బెహరా భాస్కరరావు మాట్లాడుతు పార్టీ పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సచివాలయం పరిధిలో వివిధ పథకాల కింద రూ15.27 కోట్లు మంజూరు చేశారన్నారు. ఆడారి ఆనంద్‌కుమార్ ప్రజలకు ఎంతో మేలు చేస్తున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని భారీ మెజార్టీతో గెలిపించుకోవాలన్నారు. కార్యక్రమంలో పార్టీ వార్డు అధ్యక్షులు అప్పలస్వామి నాయుడు, గుణిశెట్టి శ్రీనివాసరావు, క్లస్టర్ ఇన్‌చార్జి గేదెల మురళీకృష్ణ, ఆళ్ల పైడిరాజు, బలిరెడ్డి శ్రీను, నాగూర్ తదితరులు పాల్గొన్నారు.



92వ వార్డులో పథకాల బ్యానర్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్‌ఏ రెహమాన్, బెహర భాస్కరరావు

బాధితులకు భరోసా కల్పించిన 'ఆడారి'



గోడ కూలిన భవనానికి ఆధారంగా ఏర్పాటు చేసిన కర్రలు

మల్కాపురం: జీవీఎంసీ 59వ వార్డు పరిధి ములగాడ హౌసింగ్‌కాలనీ కొండ ప్రాంతంలో ఇటీవల కురిసిన తుపాను కారణంగా ఓ నూతన భవనం గోడతో పాటు రక్షణ గోడ కూలిన సంగతి తెలిసిందే. దీంతో అంతా భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. ఇంటి యజమానులు ఆ భవనం కూలకుండా దాని దిగువ పెద్ద కర్రలు ఏర్పాటు చేశారు. భవనంలోని వారు ప్రాణభయంతో వేరే చోట ఆశ్రయం పొందుతున్నారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ ములగాడ మండల రెవెన్యూ తహసీల్దార్ వీరభద్రరావుతో కలిసి ఘటనా స్థలానికి శుక్రవారం వెళ్లారు. జరిగిన నష్టాన్ని తెలుసుకున్నారు. అనంతరం బాధితులతో మాట్లాడి భయపడొద్దని, యుద్ధప్రాతిపదిక రక్షణ గోడ నిర్మించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కలిదిండి బద్రీనాథ్, ఇండస్ట్రియల్ ఏరియా ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు పుర్రె సురేష్‌యాదవ్, క్లస్టర్ -2 అధ్యక్షుడు అంగ రామ్‌ప్రసాద్, మాజీ కార్పొరేటర్ పిల్లా కన్నబాబు, వార్డు అధ్యక్షుడు రేవళ్ల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్‌తో కలిసి పరిస్థితి తెలుసుకుంటున్న ఆడారి ఆనంద్‌కుమార్

ప్రతి ఇంటికీ సంక్షేమ ఫలాలు

- అందుకే ముఖ్యమంత్రిగా జగనే కావాలి
- సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్



రహదారి నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఆనంద్‌కుమార్. పక్కన డిప్యూటీ మేయర్ శ్రీధర్

విశాఖ విద్య: ప్రతి ఇంటికీ సంక్షేమ ఫలాలు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం పని చేస్తోందని, అందుకే మళ్లీ ఆంధ్రప్రదేశ్‌కు ముఖ్యమంత్రిగా జగన్ మోహన్‌రెడ్డి కావాలని వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ అన్నారు. జీవీఎంసీ 52వ వార్డు సాకేతపురం-3 సచివాలయం పరిధిలో శుక్రవారం నిర్వహించిన ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలంటే జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. సచివాలయం పరిధిలో రూ.18 కోట్ల మేర సంక్షేమ ఫలాలు అందించినట్లు తెలిపారు. ఇందుకు సంబంధించిన బోర్డును, మా నమ్మకం నువ్వే జగన్ శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా న్యూ కరాస నుంచి గణేష్ నగర్ వరకు రూ.50 లక్షలతో చేపట్టబోయే నూతన రహదారి నిర్మాణ పనులకు ఆయన డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్‌తో కలిసి శంఖుస్థాపన చేశారు. అనంతరం కరాస పార్కులో రూ.30 లక్షలతో ఏర్పాటు చేసిన మోడల్ లైటింగ్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బీఎస్ కృష్ణ, వార్డు నాయకులు జియ్యాని మారుతి, సింహాచలం ట్రస్టు బోర్డు మెంబర్ శ్రీదేవి వర్మ తదితరులు పాల్గొన్నారు.



పార్కులో సెంట్రల్ లైటింగ్‌ను ప్రారంభిస్తున్న ఆనంద్‌కుమార్

టెక్నికల్ విద్యార్థులకు ప్రాక్టికల్ నాలెడ్జ్ అవసరం



సెమినార్‌లో మాట్లాడుతున్న అనిల్‌కుమార్

గోపాలపట్నం: నరవ విశాఖ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఇంజినీరింగ్ కళాశాలలో టక్నో ప్రెన్యూర్‌షిప్ అంశంపై శుక్రవారం సెమినార్ నిర్వహించారు. కార్యక్రమాన్ని ఏపీ ఇన్నొవేషన్ సొసైటీ సీఈవో టి.అనిల్‌కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టెక్నికల్ విద్యార్థులు ప్రాక్టికల్ నాలెడ్జ్ పెంచుకోవాలని సూచించారు. స్టార్టప్ కంపెనీలు ప్రారంభించేలా ఆలోచనలు ఉండాలన్నారు. కమ్యూనికేషన్ స్కిల్స్ పెంపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.శ్రీధర్ పట్నాయక్, చందన, బి.జీవన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

కోరమాండల్ ఎక్స్‌ప్రెస్ రద్దు

తాటిచెట్లపాలెం: షాలిమర్‌లో శుక్రవారం బయలు దేరాల్సిన షాలిమర్-చెన్నై సెంట్రల్(12841) కోరమాండల్ ఎక్స్‌ప్రెస్ పెయిరింగ్ రైలు ఆలస్యంగా నడుస్తున్నందున రద్దు చేసినట్లు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు.

ఈవీఎంల పనితీరుపై అవగాహన

గోపాలపట్నం: ఓటింగ్ ప్రక్రియలో ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ల(ఈవీఎం) పనితీరుపై గోపాలపట్నం రెవెన్యూ అధికారులు విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నారు. ఎన్నికల కమిషనర్, జిల్లా కలెక్టర్ ఎ.మల్లికార్జున ఆదేశాల మేరకు గోపాలపట్నం మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సురేష్ శుక్రవారం 92వ వార్డు వెంకటాపురం ఎంపీపీ స్కూల్‌లో బూత్ నంబర్ 24, 25, 27ల్లో ఓటింగ్ వేయడంపై అవగాహన కల్పించారు. ప్రతి ఓటరు ఈవీఎం కంట్రోల్ యూనిట్, బ్యాలెట్ యూనిట్, వీవీ ప్యాడ్‌ల గురించి తెలుసుకోవాలన్నారు. ఈ పరికరాలు ఏవిధంగా పనిచేస్తున్నాయో వివరించారు. ప్రజల సందేహాలను నివృత్తి చేశారు. ఎవరైనా నిబంధనలకు విరుద్ధంగా ఓటు వేయాలని ప్రయత్నిస్తే మిషన్ పనిచేయకుండా ఆగిపోయేలా బటన్ ఉంటుందని, దీన్ని అత్యవసరంగా వాడుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సచివాలయం కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి అవగాహన కార్యక్రమాలు
ఈ నెల 9న వెంకటాపురం ఎంపీపీ స్కూల్‌లో, 11న వెంకటాపురం మూడు గుడుల వద్ద కమ్యూనిటీ హాల్‌లో, 12న ఎస్సీ బీసీ కాలనీ ఎంపీపీ స్కూల్‌లో, 13న కంపరపాలెం ఎంపీపీ స్కూల్‌లో, 14న ఎస్సీ బీసీ కాలనీ కమ్యూనిటీ హాల్‌లో, 15న కంపరపాలెం అంగన్‌వాడీ సెంటర్‌లో, 16న గోపాలపట్నం జెడ్పీ హైస్కూల్ లో, 18న కొత్తపాలెం జెడ్పీ హైస్కూల్‌లో, 19న కొత్తపాలెం ఎంపీపీ స్కూల్‌లో, 20న పాత గోపాలపట్నం ఎంపీపీ స్కూల్‌లో, 21న లక్ష్మీనగర్ ఎంపీపీ స్కూల్‌లో, 22న బుచ్చిరాజుపాలెం సెయింటాన్స్ స్కూల్‌లో, 23న పాత గోపాలపట్నం ఎంపీపీ స్కూల్‌లో, 24న పాత గోపాలపట్నం అంగన్‌వాడీ కేంద్రంలో, 26న చిన్నబుచ్చిరాజుపాలెం ఎంపీపీ స్కూల్‌లో, 27న బాజీ జంక్షన్ రాజీవ్ కమ్యూనిటీ హాల్‌లో, 28న బాజీ జంక్షన్ అంబేడ్కర్ కమ్యూనిటీ హాల్‌లో, 29న బుచ్చిరాజుపాలెం జీవీఎంసీ యూపీ స్కూల్‌లో ఈవీఎంల పనితీరుపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆర్‌ఐ సురేష్‌కుమార్ తెలిపారు. ఆయా ప్రాంతాల్లో జరిగే ఈ కార్యక్రమాలకు ప్రజలు హాజరు కావాలని కోరారు.



అవగాహన కల్పిస్తున్న ఆర్‌ఐ సురేష్‌కుమార్

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న సమన్వయకర్త ఆనంద్‌కుమార్



ఆలయంలో బోరును ప్రారంభిస్తున్న ఆడారి ఆనంద్‌కుమార్

మల్కాపురం : పశ్చిమ పరిధిలో గల 58వ వార్డు అభివృద్ధిపథంలో దూసుకుపోతోంది. శుక్రవారం వార్డులోని శాంతినగర్‌లో రూ. 12.50 లక్షలతో సీసీ రోడ్డు, డ్రైన్ల నిర్మాణం, ఉప్పరకాలనీలో రూ. 20 లక్షలతో సీసీ రోడ్డు, డ్రైన్లు, ములగాడ కాలనీలో రూ 7.22 లక్షలతో సీసీ రోడ్డు, ఎదురవానిపాలెంలో రూ. 15 లక్షలతో సీసీ రోడ్డు, గొందేశివానిపాలెంలో రూ. 7.79 లక్షలతో సీసీ రోడ్డు, డ్రైన్ల మరమ్మతు పనులకు వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ శంకుస్థాపన చేశారు. అనంతరం స్థానిక విఘ్నేశ్వర విశాలక్షి సహిత విశ్వేశ్వర దేవాలయానికి కోరమాండల్ యాజమాన్యం అందించిన బోరు బావిని ఆనంద్‌కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశ్చిమను ఆదర్శవంతమైన నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని, విమర్శకులు నిజం తెలుసుకుని మాట్లాడాలని ఆనంద్‌కుమార్ అన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ గులిగిందల లావణ్య, పొడుగు రాజు, వేణు, అప్పలరెడ్డి, ప్రసాద్‌రెడ్డి, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఓటరు జాబితాలో సవరణకు స్పందన



ప్రత్యేక సవరణ కార్యక్రమంలో పాల్గొన్న కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు

సింధియా: పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం నిర్వహించిన ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. 62వ వార్డు దుర్గానగర్‌లో కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు ఆధ్వర్యంలో ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరిగిన కార్యక్రమంలో ఓటర్లు తమ ఓటరు కార్డులో మార్పులు, చేర్పులు చేసుకున్నారు. నూతన ఓటర్లు తమ ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకున్నారు. శనివారం కూడా ఓటర్లు జాబితా సవరణ కార్యక్రమం ఉంటుందని, ఓటర్లు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని లక్ష్మణరావు కోరారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్ నక్కా సూర్యనారాయణ, ఇతర నాయకులు పాల్గొన్నారు.